# పనసపండు

పోశయ్యకు పొలాలు, చెలుకలు లేకున్నా రెండు పనస చెట్లున్నాయి. వాటి చుట్టూ ఆశలగూడు....వాటిముందు పూరిగుడిసె ఉన్నాయి.

ఆ రోజు కిరాయకు బండి మాట్లాడుకొని పనసపండ్లను అంగడికి తోలుక పోవడానికి సిద్ధమవుతున్నాడు పోశాలు.—

"నువ్వు ఎదుర్రాయె లచ్మి...." అని బిడ్డను పిలిచాడు.

లచ్మి బండి కెదురుగా వచ్చింది.

ఆ అమ్మాయి శుక్రవారమునాడు పుట్టింది. ఎవరో అన్నారు పోశాలుతో....
"ఒరే పోశిగా.... నీ ఇంట్ల లచ్మి పుట్టిందిరా........ ఇగ అదురుట్టం నీ తలుపు తట్టుదిరా...." అని.

అప్పట్నించి ఎదురు చూస్తున్నాడు పోశాలు....అదృష్టం తన గుడిసె తలుపు ఎప్పుడు తట్టుందాని!....

జొరాలు వస్తున్నాయి....ఆకలి రోగాలు వస్తున్నాయి....అప్పులు వస్తు న్నాయి....అవమానాలు వస్తున్నాయి.... కాని అదృష్టం మాత్రం తన గుడిసెకు రావటంలేదు. అయినా వొస్తుందని పిచ్చి నమ్మకంతో ఎదురుచూస్తూనే ఉన్నాడు పోశాలు.

లచ్మి పెరిగి పెద్దదయింది. ఈపాటికి అదృష్టం తన గుడిసెకు బయలు దేరే ఉంటుంది. కాని ఎన్ని సందులు గొందులు.... మురికికాలువ దాటాలి తన గుడిసె చేరాలంటే!.... అందుకే అలస్యమై ఉంటుంది. అదృష్టం తన గుడిసెకు వస్తుంది.

ఆ భరోసాతోటే లచ్మి పుట్టినపుడు యాభై రూపాయలు కొత్త అప్పు చేసి బారసాల జరిపాడు. కులంవాళ్ళను పిలిచి కల్లుపోయించాడు.

అందరూ పోశాలు కూతురు 'లచ్మి' అనే దీవించారు. పోశాలు అదృష్ట వంతుడు అన్నారు.

పోశాలు గుడిసెను తాకట్టు పెట్టుకొని షావుకారు పీసయ్య అసలు పేరు రోశయ్య ఆ కొత్త అప్పు ఇచ్చాడు.

అలా పోశాలు గుడిసె పీసయ్య గుప్పిట్లో. పోశాలు పీసయ్య నోట్లో ఆరేండ్లనుంచి గిలాగిలా కొట్టుకుంటున్నారు.

పోశాలుకు మిగిలిన ఆస్తి రెక్కలు మాత్రమే. ఏ కూలీనాలీ చేసి యేటా అతడు చెల్లించేది పీసయ్య వడ్డీ కిందనే జమకట్టుకుంటున్నాడు. 'అసలు' హాయిగా కదలని గుట్టలా పోశాలు గుండెమీద కూర్చున్నది.

"అయ్యా!" పిలిచింది లచ్మి.

ఆలోచనల్నించి తేరుకున్నాడు పోశాలు.

"జెర నవ్వుకుంట ఎదురంగరా బిడ్డా" అన్నాడు కూతురుతో—

లచ్మి నవ్వింది. మొహానికి అతుకు పెట్టినట్లుగా ఉందా నవ్వు.

అలా నవ్వుతూ కూతురు ఎదురు రాగా పనసపండ్ల బండి నడిపించుకుంటూ పోశాలు వెళ్ళిపోయాడు.

ఆ పనసపండ్లు అమ్మి పీసయ్య బాకీ తీర్చి మిగిలే డబ్బుతో భార్యకో చీర కొనాలి....కూతురుకో గౌను కుట్టించాలి అనుకున్నాడు. తన గుడిసె పీసయ్య గుప్పిటినుంచి బయటపడుతుందని, తన బతుకు బాగుపడుతుందని ఆశించాడు.

బండిముందు పోశాలు నడుస్తున్నాడు. కిరాయకు బండికట్టిన వ్యక్తే బండిని నడిపిస్తున్నాడు.

నడుస్తున్న పోశాలు ఒకసారి వెనక్కు తిరిగిచూశాడు.

అతనికి బండిలోని పనసపండ్లలో భార్య నవ్వుమొహం కనిపించింది. బిడ్డ సంబరం కనిపించింది.

తెలుపు దుస్తులేసుకొని కళకళ లాడుతూ తన గుడిసె కనిపించింది.

అప్పుడే తాను పీసయ్య ఋణభారంనుంచి విముక్తుడైనట్లు తేలికగా ఊపిరి పీల్చుకున్నాడు.

* * *

పైడయ్య కమీషన్ వ్యాపారి.

వ్యవసాయదారుల నుంచి ధాన్యం, పండ్లు కొని టోకువర్తకులకు అమ్ముతుంటాడు.

పైసా పెట్టుబడి లేదు. కాని వేలు లక్షలలో వ్యాపారం!

అదే అతని ప్రత్యేకత.

అతడు షవర్‌బాత్ పూర్తిచేసి ఒంటికి సుగంధాలు అద్దుకున్నాడు డైనింగ్ టేబుల్‌ముందు కూర్చొని టిఫిన్ చేశాడు. సోఫాలో కూర్చొని పైప్ వెలిగించాడు.

టి.వి. ప్రక్కనున్న అల్మరా తెరిచి చేతివ్రేళ్ళకు బంగారు సొగసులను. వజ్రాల కాంతులను తొడుక్కున్నాడు.

ఖరీదైన దుస్తులు వేసుకున్నాడు. మేడముందు నిల్చున్న కార్లో కూర్చున్నాడు.

రోడ్డుమీద మెత్తగా కదులుతోంది కారు....

* * *

ఎండలో నడిచి నడిచి అలసిపోయి రొప్పుతూ ఎడ్లు పనసపండ్ల బండిని తాపాకా అంగడికి చేరవేశాయి.

అప్పటికే కొన్ని బండ్లు అక్కడికి చేరుకొని ఆసాములకోసం ఎదురు చూస్తున్నాయి.

ఎన్నో జతల ఆశల కళ్ళు దారులు కొలుస్తున్నాయి.

పోశాలువెంట బండి తోలుకొనివచ్చిన అప్పన్న ఎడ్లను విడిచి మేతవేసే ప్రయత్నంలో ఉన్నాడు.

పోశాలు బండికాడిమీద కూర్చొని అక్కడక్కడ నిల్చున్న బండ్లను, జనాన్ని చూస్తున్నాడు.

* * *

కారు వచ్చి బండ్లముందు ఆగింది.

నింపాదిగా పైడయ్య కారు దిగాడు.

అప్పుడే ప్యాకెట్‌నుంచి తీసిన సబ్బులా నిగనిగలాడుతున్నాడు.

ఎలా దువ్వుకున్న క్రాప్ అలాగే ఉంది.

ఎలా వేసుకున్న దుస్తుల ఇస్త్రీ మడత అలాగే ఉంది....

ఎండనక, వాననక....రాత్రనక.... పగలనక తమ నెత్తురును ఆవిరిగా మార్చుకొని పొలాల్లో కష్టించి పనిచేసి .... ధాన్యాన్ని సంచులలో నింపుకొని సిటీ నోటిదాకా తెచ్చిన రైతులు గంపెడు ఆశతో పైడయ్య ముందు దీనంగా నిల్చున్నారు....

అతడు ధాన్యాన్ని.... పండ్లను బేరం చేశాడు. "సాయంకాలం మా మనిషిని పంపిస్తా....పైసలు ఇస్తడు.." అని చెప్పి కారులో వెళ్ళిపోయాడు.

సాయంకాలం కోసం ఎదురుచూస్తూ అక్కడే వేచిఉన్నారు రైతులు, పోశాలులాగే పండ్లు అమ్మడానికి వచ్చిన వాళ్ళంతా.

కొందరు రాళ్ళపొయ్యిమీద గింజలు ఉడికించుకొని తింటున్నారు.

కొందరు జొన్నరొట్టెలు నములుతున్నారు.

"అన్నా నేనేం తేలె...." తనకు బండి తోలుకొచ్చిన అప్పన్నతో దీనంగా అన్నాడు పోశాలు.

"సరెలేయే....నా తాన రూపాయి నేబులున్నయి - అట్లబోయి ఏవన్న తెత్తాను-"

అప్పన్న దగ్గరలోనున్న గుడిసె హోటలుకు పోయి నాలుగు మిరప బజ్జీలు తెచ్చాడు.

చెరి రెండు తిని నీళ్ళుతాగారు.

కడుపులో మంట ఎక్కువయింది.

* * *

పైడయ్య సేట్ మదన్‌లాల్‌కు ఫోన్ చేశాడు — మదన్‌లాల్ పండ్ల వ్యాపారి.

పనసపండ్ల బేరం పావుగంటసేపు ఫోన్‌లమీద కొనసాగింది.

చివరికి సేట్ మదన్‌లాలే పైడయగ బేరంచేసిన పనసపండ్లు కొన్నాడు.

మదన్‌లాల్ మనిషి పైడయ్యకి పైకం చెల్లించి పనసపండ్లు అంగడినుంచి తీసుకపోయాడు.

ఆరోజు రైతులకు, పండ్లు అమ్మినవారికి చెల్లించినదిపోగా మిగిలిన మూడువేల రూపాయలను జేబులో వేసుకొని పైడయ్య తాపీగా కారులో కదిలి పోయాడు.

పైసా పెట్టుబడి లేదు— మూడు గంటల్లో మూడువేలు సంపాదించాడు పైడయ్య

అందుకే పైడయ్య పళ్ళు బంగారం....

పైడయ్య వేళ్ళకు బంగారం!

పైడయ్య ఒక కొడుకు అమెరికాలో ఉన్నాడు. రెండవ కొడుకు ఇండియాలో అమెరికన్‌లా వున్నాడు.

సాయంత్రం పైడయ్య క్లబ్బుకు తయారవుతున్నాడు. ఇండియాలో అమెరికాను మోస్తున్న రెండవ కొడుకు వచ్చి తనకు ఎం.బి.బి.ఎస్. లో సీటు దొరికినందుకు స్నేహితులకు పార్టీ ఇస్తున్నాను అన్నాడు.

అల్మారానుంచి ఐదు వందలు తీసి ఇచ్చాడు పైడయ్య.

"ఫైవ్ హండ్రెడ్ ఏమూలకు డాడీ?" విలాసంగా నవ్వుతూ అన్నాడు కొడుకు.

అంతలో పైడయ్య భార్య రత్నమ్మ వచ్చింది.

"చూడు మమ్మీ మా ఫ్రెండ్స్ పార్టీకి డాడీ ఐదువందలే ఇస్తున్నాడు—" అని ఫిర్యాదుచేశాడు కొడుకు

"ఏవిటండి మీరు మరీను....వాడు మీ స్థాయికి తగ్గట్టు ఖర్చుపెట్టాలా లేదా.... ఫ్రెండ్స్‌కు పార్టీ ఇస్తుంటే ముష్టి అయిదొందలా!" నిష్ఠూరంగా చూసింది. "ఇంకో వేయి ఇవ్వండి...." అంటూ ఆర్డర్ వేసింది.

మరో వేయి రూపాయలు తీసిచ్చాడు.

కొడుకు తండ్రిచేతిని ముద్దుపెట్టుకొని, తల్లిచేతిని ముద్దుపెట్టుకొని ఆ తరువాత ఈలవేసుకుంటూ వెళ్ళిపోయాడు.

ఆ రాత్రి వేయి రూపాయలు తాగుడుకు, ఐదువందలు కేబరే డాన్సర్‌కు ఖర్చుచేశాడు.

* * *

పండ్లు అమ్మితే నూరురూపాయలైనా వస్తాయనుకున్నాడు పోశాలు. పది రూపాయలు బండి కిరాయి పోగా మిగతా తొంభైలో నలభై రూపాయలతో భార్యకు కూతురుకు ఏదైనా కొనుక్కపోవాలని ;వారం రోజులుదాకా ఇంట్లోకి దినుసులు కొనుక్కపోవాలని అనుకున్నాడు. యాభై రూపాయలు పీసయ్యకు కట్టి లచ్మి పుట్టినప్పటి బాకీ తీర్చాలనుకున్నాడు.

కాని.... పోశాలు అనుకున్నట్టు జరిగితే అది అతని బతుకెందుకు అవుతుంది?

ఎండమావులు, పేదవాడి ఆశకు అక్కాచెల్లెళ్ళు.

ఆరోజు పోశాలు చేతికి వచ్చినవి అరవై రూపాయలు మాత్రమే—

పది బండి కిరాయకుపోగా మిగిలినవి యాభై. అందులో పైసా ఖర్చుచేయాలన్నా భయం. గుడిసె కళ్ళలో మెదిలి గుండె కలుక్కమంది. పీసయ్య బాకీ తీర్చి గుడిసెను కాపాడుకోవాలి.

కూటికి, గూటికీ దూరమైతే బతుకులు ఇక ఏటికే కదా!

కూతురు ఎంత ఆశగా తనకు ఎదురువస్తుందో! పోశాలు మనసు కలుక్కమంది గుండె లవిసిపోయాయి.

పావలా పైసలుపెట్టి బిడ్డకు గారె ముక్క కొనుక్కపోదామన్నా యాభై రూపాయల్లో పావలా తక్కువ పడుతుందని భయం - అతని కళ్ళు చెమ్మగిల్లాయి.

ఆవేదనను దిగమింగుకొని తనవాళ్ళ నవ్వు మొహాన్ని చూడాలన్న తపనను తుడిచేసుకొని పోశాలు ఊరుచేరుకున్నాడు.

ఊరి పొలిమేరలోనే పీసయ్య మనిషి ఎదురయ్యాడు.

"ఏంరా పోశిగా పండ్లు అమ్మినవా?" అని అడిగాడు.

"అమ్మిన...."

"దొరబాకీ కడ్తనవా లేదా?"

"కడ్తాను...."

"అయితే దా....ఉన్నపలంగా తోల్కరమ్మన్నడు దొర నిన్ను...."

అతడు పోశాలును పీసయ్య భవంతికి తోలుకపోయాడు.

రొంటికి చెక్కకున్న యాభై రూపాయలు తీసి పీసయ్యకు అర్పించాడు పోశాలు.

లెక్కబెట్టుకొని...."ఏందిరో యాభయే ఇస్తనవ్?"కనుబొమ్మలు ముడేశాడు పీసయ్య.

"గవ్వే అచ్చినయి దొరా...."

"నీ అవ్వ....మరి వడ్డికిందకే సరిపోదు కాదురా...."

"గుడిసెమీద అసలు కింద సూసుకోండ్రి దొరా....నీ బాంచెను కాల్మొక్తా...

"మరి వడ్డీ?"

"పంటల మీన కూలినాలి సేసి తీరుత్త బాంచెను...."

"ఇవ్వి అసలు కింద కట్టుకొని... నువ్వు పంటలమీద తీర్చే వడ్డీకోసం పదేండ్లు ఆగమంటవా?....అట్ల కుదురది వడ్డీ యాభై రూపాయలు కట్టుకుంటాన....మిగతా యాభై రూపాయల వడ్డీ అసలుకు కలుపుతాన....ఇప్పుడు కొత్త బాకీ ఎంతో తెలుసా? నూరు....ఊఁ....ఇక్కడ సంతకం పెట్టు-ఎక్కడి శనిగాడివి దాపురించినవురా.... అసలు కట్టవు - వడ్డీ పూర్తిగా కట్టవు...."

"దొరా....ఆ యాభై అసలు కింద చూసుకోండ్రి దొరా...." దీనంగా రెండు చేతులు జోడించాడు పోశాలు.

"అలా కల్వదిరా....వడ్డి ఉన్నంత అసలు జమకట్టుకునేదే లేదు...."

పీసయ్య సీసంగుండె కఠినంగా చెప్పేసింది. చేసేదిలేక ఆ కాగితంపై సంతకంచేసి మొహంమీద బాధల సంతకాల్ని మోస్తూ పోశయ్య వెళ్ళిపోయాడు.

పనసపండ్లు తన బాకీని తగ్గిస్తాయి. తన గుడిసెలో నవ్వుల దివ్వెలు వెలిగిస్తాయి అని బండెడు ఆశతో వెళ్ళిన పోశాలు బండెడు దుఃఖంతో గుడిసె చేరుకున్నాడు.

ఇక నడిచే ఓపికలేదు....తల భారంగా....కళ్లు చీకటిగా....లోకం గిర్రున తిరుగుతోంది....గుడిసెముందు కూలబడిపోయాడు. గుడిసె మసక మసకగా కనిపించింది....అతనికి గుడిసె మాయమవుతున్నట్టు అనిపించింది.

పోశాలు గుడిసె పీసయ్య ఆ స్తివంక జరుగుతోంది....

అతవి సంసారం ఏటివంక జరుగుతోంది....

అప్పుడే అతన్ని చూసి ఓ కుక్క మొరుగుతోంది...

* * *

అరటి...ఆవు...ఇటుక...ఈగ...పనస...అక్కడికి రాగానే సింహాచలం ఆగిపోయాడు.

"నాన్న....పనసపండే...."అని తండ్రిని అడిగాడు-అలా అడగడం ఏ ఇరువయోసారో....

అడిగినప్పుడల్లా తండ్రి పానకాలు-కొని స్తలేరా నువ్వు బాగా చదువుకో...." అనేవాడు -

సింహాచలం బాగా చదువుతున్నాడు. ఈనాడు "నాన్న....పనసపండే"అని గుర్తు చేశాడు.

తాను చిన్నప్పుడు తండ్రిని అలాగే అడుగడం గుర్తుకొచ్చింది పానకాలుకు. అప్పుడు పనసపండు పావలాకు వచ్చేది - కాని, ఆ పావలా మాత్రం దొరికేది కాదు.

ఎప్పుడో ఒకసారి ఒకకానీ ఇచ్చేవాడు తండ్రి. కానీకి పనసపండు ముక్క వచ్చేది.

ఆ ముక్క లింటే తనకు తృప్తి ఉండేది కాదు. మొత్తంగా ఒక పనస పండును కొనుక్కొచ్చి ఇంట్లో అందరూ తిని, తనను తృప్తితీరా తిననిస్తే బాగుండు అనిపించేది.

అందుకే పనసపండు కొనుక్కురమ్మని తండ్రిని అడిగేవాడు. ఏడ్చేవాడు. దెబ్బలు తినేవాడు.

కాని తండ్రి ఎన్నడూ పనసపండు కొనుక్కురాలేదు. తానే కానీకానీ కూడేసి పావలా చేసి పనసపండు కొనుక్కోవాలి అనుకునేవాడు.

కాని తీరా పావలా కూడేసరికి ఏ అవసరమో గద్దలా తన్నుకపోయేది.

తల్లయినా తీసేది – తండ్రనా తీసేవాడు – మాయమాటలతో తన నోరు మూసేవారు.

అలా చిన్ననాటి పానకాలు కోరిక కోరికగానే మిగిలిపోయింది.

ఇప్పుడు తన కొడుకు అదే కోరిక కోరుతున్నాడు – తన బాల్యాన్ని గుర్తు చేస్తున్నాడు.

తనెలాగైనా కొడుకు కోరిక తీర్చాలి. పనసపండు కొనుక్కురావాలి అని నిశ్చయించుకున్నాడు పానకాలు.

అతి కష్టంమీద వారం రోజులకు ఒక నాలుగు రూపాయలు పానకాలు చేతిలో ఖర్చుకాకుండా మిగిలాయి.

ఆ రోజు తప్పక పనసపండు తెస్తానని కొడుక్కుచెప్పి బజారుకు వెళ్ళాడు.

కరీం పనసపండ్ల బండిదగ్గరకి వచ్చి అడిగాడు.

"కైసా భాయ్...."

"ఓ చోటే బారా రూపాయ్...." ఆ చిన్నది పన్నెండు రూపాయలు అని చెప్పాడు కరీం. అంతకంటే చిన్నపండ్లు లేవన్నాడు.

నోరు తెరిచాడు పానకాలు.

తన చిన్నతనంలో పావలాకు, బేడకు దొరికిన పనసపండు ఇప్పుడు పన్నెండు రూపాయలు!

పనసపండు కోసం ఎదురుచూసే కొడుకు మొహం కళ్ళలో మెదిలి జేబులు తడుముకున్నాడు పానకాలు. ఎన్నిసార్లు తడుముకున్నా అవే నాలుగు రూపాయలు.

తన కొడుకు చిన్న కోరికను తీర్చలేని నాలుగు రూపాయలు .

మరో నెలరోజులైనా పన్నెండు రూపాయలు తాను కూడబెట్టలేడు....

పైగా ఆరోజు పనసపండు తెస్తానన్న తనమాట కొడుకును ఎంత ఆశగా ఎదురుచూసేట్టుచేస్తుందో ఊహించిన అతని మనసు తల్లడిల్లి అటుఇటు చూశాడు...

పనసపండులేక ఒట్టిచేతుల్తో ఇంటికి రాలేడు. తాను చిన్ననాడు తండ్రి ఏదైనా తెస్తానని చెప్పినప్పుడు ఎలా ఎదురు చూసేవాడో గుర్తు తెచ్చుకున్నాడు.

తన కొడుకు అలాగే ఎదురు చూస్తుంటాడు.

పోగానే 'పనసపండేది నానా...' అంటూ ఆత్రంగా ఎదురువస్తాడు...

ఎందరు తలిదండ్రులు తమ పిల్లల చిన్నారి కోరికలు తీర్చలేక సతమత మవుతూ... క్షోభపడుతున్నారోనని బజారువంక చూశాడు పానకాలు....

దిగులు మొహాలు కనిపిస్తే...తనలాగే తమ పిల్లలకోసం వారు దిగులుపడు తున్నట్టు ... అనుకున్నాడు....

ఏంచేయాలో తోచక....ఇంటికెల్లా వెళ్ళాలో....ఎలా కొడుకును సంతోష పెట్టేది? అని ఆలోచిస్తున్నాడు....

రోజు రోజుకు అంగడి దూరమేకాని....ఎన్నడూ చేరువకాదు! .... సోడా బండి....గారెలబండి....గాజులబండి....ప్లాస్టిక్ బొమ్మల బండి .... అరటిపళ్ళ బండి....కరీం పనసపండ్ల బండి....పనసపండు ధర పన్నెండు .... తన జేబులో నాలుగు రూపాయలు....నాన్నా, పనసపండు-ఇవ్వాళ తప్పక తెస్తా నాన్నా....

పనసపండు తీసుకపోకుండా తను ఇంటికిపోలేడు....

* * *

ఆట మాని, అమ్మ పెట్టిన అన్నంమాని....తండ్రికోసం గడపలో నిల్చొని ఎదురుచూస్తున్నాడు సింహాచలం.

తాను చదివిన పుస్తకంలోని పనసపండు మాటిమాటికి ఆ అబ్బాయి కళ్ళలో మెదులుతోంది. తన తండ్రి అలాంటి పనసపండు తెస్తాడు....తనకు పనసపండు తెస్తాడు అని తెగసంబరపడి పోతున్నాడు.

పనసపండు తీపికంటే ఆ ఊహలోని తీయదనంతో ఆ చిన్నారిమనసు నిండి పోయింది.

ఎదురుచూడగా....చూడగా....తండ్రి దూరంగా కనిపించాడు. సింహాచలం ఎదురుగా పరుగెత్తుకవెళ్ళి తండ్రికాళ్ళను పట్టేశాడు.

"నాన్నా పనసపండేది?"అని అడిగాడు ఆత్రంగా....

"ఉంది బిడ్డా..." కొడుకును ఎత్తుకొని ఇంట్లోకి వచ్చాడు పానకాలు.

"ఏదే?.."

"ఉంది బిడ్డా....తెచ్చిన."

సింహాచలం వింతగా చూస్తున్నాడు. పనసపండు ఎక్కడా కనిపించదు. తండ్రి తెచ్చాను అంటున్నాడు. వెనుక ఎవరైనా తెస్తున్నారా అని గుమ్మం దాకా వెళ్ళి చూశాడు. అలాంటి జాడలేవీ లేవు.

"అబ్బ ఏది....ఏది నాన్నా...." చేతులు ఆడిస్తూ అడిగాడు సింహాచలం.

"తెచ్చినా బిడ్డా, నోరు తెరువు"అన్నాడు.

సింహాచలం నోరు తెరిచాడు. నోటికి పనసపండు ముక్క అందించాడు తండ్రి.

ఆ తీపి ముక్కను కొరుక్కుంటూ, "పండేది నాన్నా?..." అని అడిగాడు.

"ఉంది నాన్నా ఇస్తున్నా...."అంటూ తండ్రి జేబులోంచి ప్లాస్టిక్ పనస పండు బొమ్మ తీశాడు.

ఆశ్చర్యంగా చూడసాగాడు సింహాచలం.

"మీ పుస్తకంలో ఉన్నట్లులేదా?" - అడిగాడు తండ్రి-ఉన్నదన్నట్లు తలూపాడు సింహాచలం.

"ఇప్పటికి ఈ పనసపండు తీసుకొని ఆ ముక్క తిను బిడ్డా...." అంటూ సింహాచలం చేతికి ప్లాస్టిక్ పనసపండు బొమ్మను ఇచ్చాడు తండ్రి.

(యువ మంత్లీ—జూన్, 1984)